# అభిసారిక

## బి. యల్. దేశపాండే

"శ్యామలా" శాన్త చెప్పిన మాటలు వినవమ్మా. మీనాన్న చనిపోయినప్పటినుంచి మల్లెపువ్వులాగా, నలగకుండా పెంచుకొచ్చాను. చేతనైనంత చదువు చెప్పించాను, వయస్సు వచ్చింది, ఏ డబ్బుగలవాడికో యిచ్చి ఆ మూడుముళ్ళు వేయిస్తే, నీవూ ఓయింటిదానవవుతావు. ఏదో నీవూ సుఖపడుతూవుంటే చూద్దామని వుంది. నేను చెప్పినట్లు నాగేశ్వరరావుగారి అబ్బాయి భాస్కర్ చాలా మంచివాడు మంచి అందంగలవాడు. ఆయనను చేసుకున్నావంటే, అరచేతిలో పెట్టుకొని పూజిస్తాడు.

"అమ్మా" నాపెండ్లి విషయంలో నాదేగాని హక్కు నీదిగాదు. నేనుగాని పెండ్లిచేసుకునేది నీవుకాదు. నన్ను ఎందుకే పోరుపెడ్తూవుంటావు రోజూ. ఈ ధనపిపాసులను చస్తేకూడా పెండ్లిచేసుకోను. ధనం వుందిగదా అని మద, అహంకారాలను చూపించే, ఈ ధనాంధులకా నన్ను యిచ్చి పెండ్లి చేయాలనుకుంటూ వున్నావు? ఈ జాతిపేరే తలవను అమ్మా.

"అదేమిటే...అలా కంట నీరు కారుస్తూ వున్నావు. నీకు ఆ సంబంధం ఇష్టంలేకపోతే ఏడుపు ఎందుకు?"

ఏదో యింత పెంచి పెద్దదాన్ని చేశాను కనుక ఓయింటిదాన్ని చేసి సంతోషించుదామనుగాని, నీకిష్టంలేని సంబంధం నేనుమాత్రం ఏలా బలవంతంగా చేయను?

"అమ్మా" నాన్నే బ్రతికివుంటే నామంచి సంబంధాలు కాకపొయ్యేవా? మనం డబ్బు లేకుండా బాధపడుతూవుంటే ఏ ధనవంతుడైనా 10 రూపాయలు అప్పు యిచ్చారుటే, మానాన్న చచ్చిపోదే శవదహానానికి ఎంతమందిని డబ్బు కోసరం ఆశించలేదే అమ్మా? ఆఖరుకు చిల్లిగవ్వ అయినా యిచ్చినారుటే? చివరకు యిల్లు తాకట్టుపెట్టి గదుటే దహన సంస్కారాలు చేసింది. ఈ విషయం మరచిపోయావుటే అప్పుడే? యింకా ధనవంతులు, ధనవంతులూ అని ఆశపడుతావు.

"అమ్మాయి" యింతమాత్రానికే మనం వాళ్ళను వెక్కిరించటం దేనికిలేవే? మనకర్మం అది వారినంటే ఏమి లాభం?

"కర్మ, కర్మ అంటూనే పేదవాళ్ళు అంతా ధనాంధులకు బానిసలైపోతూ వున్నారు ఈ పేదలు. ఈ ధనాంధులకే కట్నాలు కట్నాలు అని వేలకువేలు గుప్పి పిల్లను యిచ్చి పెండ్లి చేస్తారు సుఖపడుతుందని. ఇలా కట్నాలు కాజేసి, పిల్లను సరిగ్గా చూడక, నానా హింసలు పెట్టటంలేదు, ఎంతమంది భార్యలను వదలి వ్యభిచార గృహాలకు వెళ్ళటంలేదు. ఎంతమంది మొగతనం లేకుండా, భార్యను పలుకరించకుండా కాలం గడపటంలేదు? ఎంతమంది పేద సంసారాలను నాశనం చేయులేదు? యివి అన్నీ రోజూ

వింటూనే యింకా ధనవంతులను వెనకవేసుకొస్తా వేం అమ్మా?

"అమ్మాయి" మనకెందుకు ఈ వితండ వాదాలు? ఎలా జరగాలో ఆలా జరుగుతూ వుంటుంది. లే భోజనం చేద్దువుగాని.

శ్యామలకు ధనవంతులంటే మహా మంట. చిన్నప్పుడు తాను బడికి పోతూవున్న రోజులలో నుంచి కూడా బీదపిల్లలన్నా, బీదవారన్నా మహా భారంగా చూస్తూవుండేది. స్కూలులోకూడ, ధనవంతుల పిల్లలకు, బీదపిల్లలకు జరిగే సౌకర్యాలను చూస్తూ మనసులో చాలా బాధపడుతూ వుండేది. బీదవిద్యార్థులు కష్టపడి చదివినా తప్పుతూ వుండేవారు. ధనవంతుల విద్యార్థులు చదవకపోయినా లంచాలు యిచ్చి ప్యాసుఅవుతూ వుండేవారు. శ్యామలకు ఈలాంటి చదువు ఎందుకు చదవాలా అని అనుకుంటూ వుండేది. శ్యామలకు రామారావు అనే బీదవిద్యార్థి మంచి స్నేహితుడయ్యాడు. వాళ్ళు యిద్దరూ క్లాసులో అందరికంటే బాగా చదివి పైచేయిగా వుండే వారు. ధనవంతుల బిడ్డలకు వీళ్ళను చూస్తూ వుంటే కోపంగా వుండేది. ఎవరేమనుకున్నా, వీరి స్నేహాలకు, చదువుకు భగ్నం లేకుండా, ఇద్దరూ స్కూలు ఫైనల్ వరకూ చదువుకున్నారు. ఇద్దరూ అంతపైపై చదువు చదవలేక (అంటే డబ్బులేక) మానేశారు. స్కూలులో మానినప్పటికి, రామారావు శ్యామల యింటికి, శ్యామల రామారావు యింటికి రాకపోకలు జరుగుతూ వుండేవి. యిద్దరూ పెండ్లి చేసుకోవాలని అనుకున్నారు. రామారావు తల్లిదండ్రులు మాత్రం ఒప్పుకున్నారు. కాని శ్యామల ఈ సంగతి తన తల్లికి తండ్రికి చెప్పలేదు. ఈలాగే రోజులు గడిచి పోతూవున్నాయి.

రామారావు ఓ యిన్సూరన్సు కంపెనీలో మేనేజరుగా చేరాడు. చేరిన రెండు మాసాలకే ఆ ఊరునుంచి మరొక ఊరుకు బదిలీచేశారు. అందువలన రామారావు తప్పనిసరిగా ఆ ఊరును, తన స్నేహితురాలు శ్యామలను విడిచి వెళ్ళవలసి వచ్చింది.

రామారావు వెళ్ళినప్పటినుండి శ్యామల దిగులుపడుతూ వుంది. తన దిగులు సంగతి తనకే తెలుసుగాని యింట్లోవారికి ఎవరికీ తెలియదు. రోజురోజుకు తగ్గిపోతూవుంది. ఈమె ఈలా వుంటూవుండగానే తండ్రి అకస్మాత్తుగా గుండె ఆగిపోయి మరణించాడు. దిగులు ఇంకా అధికమైనది. రోజురోజుకు సంసారం గడవటం దుర్లభమయింది. గత్యంతరం ఏమిటో తోచింది కాదు. తననిగూర్చి, తనతండ్రి మరణాన్ని గూర్చి రామారావుకు ఉత్తరం రాసింది శ్యామల. ఈవిషయం తల్లికి తెలియదు. పాపం ఉత్తరం చూచుకోగానే రామారావు ఆతురతగా పరుగెత్తుకొచ్చాడు రెండురోజులు శెలవుపెట్టి.

"తిన్నగా శ్యామల యింటికే ముందువచ్చి" శ్యామలను, తల్లిని ఓదార్చాడు. వారికి కలిగిన కష్టానికి చాలా నొచ్చుకున్నాడు. చాలాసేపు శ్యామలతో మాట్లాడి, తప్పక త్వరలో నేపెండ్లి చేసుకుంటానని చెప్పి, తనయింటికి వెళ్ళుతున్నానని 200 వందల రూపాయలు శ్యామలకు యిచ్చి ఖర్చులు గడుపుతూవుండూ, కావలసినప్పుడల్లా ఏమీ సంకోచం లేకుండా ఉత్తరం రాస్తూవుండు పైకం పంపుతూ వుంటాను అని చెప్పి, రామా

రావు తన తల్లిదండ్రులు వున్న యింటికి వెళ్ళాడు.

శ్యామల ఆనందానికి అంతులేదు రెండు రూపాయలు కనీసం ఎనిమిది మాసాలు వస్తాయి అని సంతోషించింది. ఈసంగతి తల్లికి చెప్పింది. తల్లికి అనుమానం ఏమిటో కలిగినట్లు జేల చూపు చూచింది. పెండ్లి చేసుకుంటాడన్న మాట మాత్రం కప్పిపుచ్చింది తల్లితో శ్యామల.

రామారావు తనపెండ్లి శ్యామలతో తొందరలో చేయాలని గట్టిపట్టు పట్టాడు తల్లిదండ్రులతో. రామారావు మాటకు ఎదురు ఏమీ చెప్పలేక తప్పక చేస్తాము అన్నారు. రామారావు తిరిగి తన ఉద్యోగం శెలవు అయిపోవటం చేత వెంటనే బయలుదేరి వెడుతూ తిరిగి శ్యామలను చూచి పలకరించి వెళ్ళాడు.

రామారావుమీద ఏమిటో అనుమానం కలిగి అప్పటినుంచి శ్యామలకు పెండ్లి చేయాలని శ్యామల తల్లి అనుకుంటూ, మధ్యమధ్య వారు వున్నారు, వీరు వున్నారు అని శ్యామలను పోరు పెడుతూ వుండేది.

ఒకరోజు ఆపోరు పడలేక గట్టిగా చెప్పింది తల్లితో శ్యామల. తనపెండ్లి రామారావుతోనే అవుతుంది అని. తల్లి ఆశ్చర్యపడింది. తన అనుమానం వృథా కాలేదన్నట్లు వెలిబుచ్చింది ఆమె చిరునవ్వు. తల్లి ఏమీచేయలేక రామారావు తల్లిదండ్రుల దగ్గరకుపోయి తన కుమార్తెను రామారావుకు యివ్వాలనుకున్నాను. మీ ఉద్దేశ్యము ఏమిటి అని అడిగింది. "మీరు వచ్చి అడగలేదనే మేమూ వూరుకున్నాము యింత కాలంనుంచి—లేకపోతే ఏనాడో చేశేవాళ్ళం అన్నారు రామారావు తలిదండ్రులు.

తనకోరిక తీరినట్లు సంతోషపడి ముహూర్తం నిశ్చయించండి అని చెప్పి శ్యామల తల్లి వచ్చేసింది.

ముహూర్తం కుదిరించి, అతి వైభవంగా శ్యామలకు, రామారావును యిచ్చి పెండ్లి చేశారు. సంసారం అతి ప్రేమపూరితంగా, ప్రేమ కెరటాల సముద్రములో పూలనావపై శ్యామల, రామారావులు అత్యంత ఆనందంతో కాలం గడుపుతూ వున్నారు.

శ్యామల పెండ్లి కాగానే శ్యామలతల్లి రామారావుగారింట్లోనే వుంటూ వంటా అదీ చేస్తూ, ఏ భగవద్గీతో చదువుకుంటూ ఆమె జీవితాన్ని అలా నడుపుకొంటూ, కూతురూ, అల్లుణ్ణి కనిపెట్టుకొని కాలం వెళ్ళబుచ్చుతుంటోంది. శ్యామల ఎవరికోసం నిరీక్షించిందో వారినే పెండ్లి చేసుకున్నందుకు సంతోషించనివారు లేరు.

